# అతనికంటే ఘనుడు




మంగపతి మినిస్టర్ దూబయ్య దగ్గర చాలా కాలంగా పర్సనల్ సెక్రటరీగా పని చేస్తున్నాడు. దూబయ్యకి తనదేం పోర్టు ఫోలి యోనో మంగపతి చెప్తేగానీ తెలీదు.. అంత అమాయకుడతను!

అసలు మంత్రి దూబయ్య సంతకం పెట్టడం కూడా తను

పదవిలో రావడానికి కొద్ది రోజుల ముందే నేర్చుకున్నాడు. అపను వేలుముద్రలు వేసే కాలంలో ఆ ముద్రలు చూసినవారు వాటి వైశాల్యం చూసి గుండెలు బాదుకునేవారు. కొందరేమో మరీ ఇదిగా ఆ వేలు ముద్రంత వైశాల్యం గల స్థలం ఉంటే యల్.ఐ.జి. ఇల్లొకటి కట్టుకో వచ్చని అనేవారు.

దీన్నిబట్టి దూబయ్య బహు దొడ్డ మనిషని అర్థం అవుతుంది. మనిషేకాదు అతని మెదడు కూడా దొడ్డగా ఉంటుంది. అందుచేత మంగపతి చాలా పవర్‌ఫుల్ అయిపో యాడు.మంగపతేం చెప్తే దూబయ్య అది.దూబయ్యేకాదు,మినిస్టరెవరైనా ఎలాంటి వారైనా మంగపతి తల క్రిందులు చేసేయగలడు. మంగపతి అలాంటివాడూ, అల్లాటప్పాగాడూ కాదు.నెయ్యిని గొడ్డు కొవ్వు.గొడ్డు కొవ్వుని నెయ్యీ చేసెయ్యగలడు. అందుకనే పదేళ్ళ క్రితం కూర్చో డానికి చాపకూడా లేనివాడు ఇప్పుడు చార్‌మినారంత బిల్డింగ్ కట్టేశాడు.

మంగపతికి ఈ మధ్య మరో బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. దానితో అతను వేలకు వేలు అతి సునాయాసంగా సంపాదిస్తున్నాడు. అసలు తనకు అలాంటి ఆలోచన రావడం సిన్మాతార ఒక్కడితోనే కాపురం చెయ్యడమంత ఆశ్చర్యం తనకు తనకే కలిగింది.

తన బుర్రమీద తనకే వల్లమాలిన అభిమానం ఏర్పడిపోయింది. అసలు తన మెదడును ఇన్సూర్ చేయించవచ్చా.వచ్చయితే ఎన్ని లక్షలకు లేదా కోట్లకు చేయించవచ్చు మొదలయిన వివరాలు ఇన్సూరెన్సు కంపెనీకి వెళ్ళి కనుక్కోవాలనే ఆలోచన కూడా అతనికి కలిగింది. వేరే వ్యవహారాల్లో తను సంపాదించిన వాటిల్లో దూబయ్యకు కమీష నివ్వాల్సి ఉంటుందిగానీ, ఈమధ్య తను కొత్తగా ఆలోచించిన పథకం ప్రకారం సంపాదించే డబ్బులో ఒక్క పైసా కూడా ఎవ్వరికీ ఇవ్వ నక్కరలేదు.

ఆరోజు మధ్యాహ్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్లారెడ్డి ఎగశ్వాసలు పీలుస్తూ మంగపతి దగ్గరికి వచ్చాడు.

"ఏం సార్! ట్రంకాల్ చేసి అంత అర్జంటుగా రమ్మని కబురు చేశారు?" అన్నాడు కీడును శంకిస్తూ.

"మీ కొంపకు నిప్పంటుకుం దండీ! ఎవడో అగ్గిపుల్ల గీసి పడేశాడు. అది చెప్పడానికే

పిలిచాను. సర్లె-సర్లె గాబరా పడకుండా ముందలా కూర్చోండి!" అన్నాడు మంగపతి.

"మోడర్న్ ఆర్టులా మీ మాటలేం నాకు అర్థం కావడం లేదు సార్! కొత్త తెలుగు సిన్మాలా అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్టు చెప్పండి."

"చెప్పడానికి నాకు నోరు రావడంలేదు. మీరే చదువుకోండి!" అని టేబులు సొరుగులోంచి ఒక కాగితం తీసి ఎల్లారెడ్డి ముందు పడేశాడు.

అది ఒక ఫిర్యాదు కాగితం. ఎల్లారెడ్డి ఏ ఏ కాంట్రాక్టుల్లో ఎంతెంత తిన్నాడో అందులో వివరంగా ఉంది. క్రింద ఎవడిదో సంతకం ఉంది. ఆ కాగితం చదివిన ఎల్లారెడ్డి ఒళ్ళు స్నేక్ డాన్స్ చేసినట్టు నిలువెల్లా కంపించింది. తన కంగారు మంగపతికి కనబడనీయ కూడదని ఏడుస్తున్నట్లు నవ్వాడు. అయినా మంగపతి వాసన పసిగట్టేశాడు. ఏమీ లేకపోతే అంత కంగారు ఎందుకుంటుందీ?

"అయితే ఇప్పుడేం చెయ్యదలిచారు?"

"ఏముందీ! ఇలా ఏదైనా ఫిర్యాదు వస్తే మినిస్టరు గారికి పంపిస్తాను."

"ఆ తరువాత?" టేబులు మీద ధన్‌మని ముందుకు పడి అడిగాడు.

"మినిస్టరుగారు సి.బి.ఐ. ఎంక్వయిరీకి పెట్టినా పెడ్తారు. తరువాత? అని నన్ను ప్రశ్నించకండి. తరువాత సంగతులన్నీ వాళ్ళే చూసుకుంటారు."

ఈసారి ఎల్లారెడ్డి కుర్చీలో వెనక్కి విరుచుకు పడిపోయాడు.

"ఫ్రిజ్‌లో పెట్టిన బ్రాయిలర్‌లా అలా బిగుసుకుపోయారేమిటీ? గిట్టనివాడేదో రాసినంత మాత్రాన మీరెందుకు భయపడాలి? ఎంక్వయిరీ చేసుకుంటే చేసుకోనివ్వండి- మీకెందుకు భయం?" మంగపతి వర్షాకాలం గోదావరిలా పొంగుతూ అన్నాడు.

"గిట్టనివాడు రాసినా గట్టి విషయాలే రాశాడు సార్! అయినా మనలో మనకు దాపరికాలు ఎందుకూ? నేను కొత్త తింటున్న మాట వాస్తవమే! ధరలు చూశారుగా! ఈ రోజుల్లో జీతం మీద ఎవడు బతకగలడండీ! మీరే నన్ను గట్టెక్కించాలి!" చేతులు రెండూ జోడించి అన్నాడు ఎల్లారెడ్డి.

"ఎలా? మరి వచ్చిన ఈ పిటీషన్ని మినిస్టరుగారి ముందు ఉంచక తప్పదే..."

"అలాగంటే ఎలాగండీ? మీరే నన్ను కాపాడాలి. ఇవి చేతులు కావు!"

"భలే వారే. చేతులు పట్టుకుని చేతులు కావంటే కాకపోతాయా?"

ఎల్లారెడ్డి చటుక్కున లేచి మంగపతి కాళ్ళు పట్టుకున్నాడు.

"కాపాడండి! మీరే నాకు దిక్కు."

"నా ఉద్దేశ్యం మీరు నా కాళ్ళు పట్టుకోవాలని కాదు. చేతులు పట్టుకుని కాళ్ళు అన్నవారు 'పర్సును చూపి జేబు అనుకోండి, నోటును చూపి తెల్లకాగితం అనుకోండి' అని అనవచ్చుగదా? హ-హ-హ" అని గట్టిగా నవ్వాడు. ఆ నవ్వుకు మంగపతి కట్టుడు పన్ను కట కట శబ్దం చేస్తూ ఊగింది.

మంగపతి మాటల్ని అర్థం చేసుకున్న ఎల్లారెడ్డి జేబులోంచి పర్సు తీశాడు. నోట్లు లెక్కబెట్టి ఇచ్చాడు.

"ఏమిటి! మూడు వేలేనా? ఈ కాగితాన్ని మినిస్టర్ ముందుంచితే సి.బి.ఐ. ఎంక్వయిరీ అదీ అయితే ఉద్యోగమే ఊడుతుంది. అయినా మీరు ఎంత సంపాదిస్తారో నాకు తెలియదా? ముష్టి మూడు వేలేనా? హుఁ!" ముక్కుతూ మూడు వేలూ ఎల్లారెడ్డి ముందు పడేశాడు మంగపతి.

ఎల్లారెడ్డి మరో రెండు వేలు తీసి మొత్తం అయిదు వేలు అతని చేతిలో పెట్టి, "దయుంచాలి. ఇహ నా వల్లకాదు" అన్నాడు.

మంగపతి మందహాసం చేస్తూ (మంగపతి పెదాలు మందంగా ఉంటాయి మరి) అయిదు వేలూ జేబులో దోపుకున్నాడు.

"భారమంతా మీ మీదే వేశాను. మీరే మినిస్టరుగారికి ఇదెవడో గిట్టని వాడు నా మీదిలా కంప్లెంట్ చేశాడని చెప్పండి! మీకు నేను బాగా తెలిసిన వాడననీ, అలాంటి వాడిని కాననీ, మంచి వాడిననీ నచ్చజెప్పండి. అయినా మీకు నేను చెప్పాలా? ఈ గండం నుండి మీరే గట్టెక్కించాలి" అన్నాడు ఎల్లారెడ్డి రెండు చేతులూ మనోసారి జోడిస్తూ.

"అంత కష్టపడటం ఎందుకయ్యా! చూడు ఏం చేస్తానో" అంటూ కాగితాన్ని చింపేశాడు.

"ఇప్పుడు తృప్తిగా ఉందా?" అని తెల్లబోయి చూస్తున్న ఎల్లారెడ్డిని అడిగాడు.

ఎల్లారెడ్డి కృతజ్ఞతలు చెప్పుకుని వెళ్ళిపోయాడు.

ఈ మధ్య మంగపతికి బ్రహ్మాండమైన ఆలోచన ఒకటి తట్టడం

ఆ పథకం ప్రకారం వేలకు వేలు సంపాదించడం ఈ విధంగానే చేస్తున్నాడు. అదెలాగంటే మంగపతి మినిస్టరు దూబయ్యతో బాటు క్యాంపులకు వెళ్ళినప్పుడు అక్కడి వాళ్ళలో కొందరిని మీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎలా పని చేస్తాడనో, మీ తాసిల్దారు ఎలాంటి వాడనో, మీ కలెక్టరు నిజాయితీ పరుడేనా అనో ప్రశ్నిస్తాడు.

వాళ్ళు ఏమాత్రం చెడుగా చెప్పినా అవి నోట్ చేసుకుని క్యాంపునుండి వెనక్కి వెళ్ళగానే తనంతట తనే ఏ తాసిల్దారు మీదో, ఇంజనీరు మీదో పిటీషన్ తయారు చేసి క్రింద ఏదో ఒక పేరుతో సంతకం పెట్టేసి, వాళ్ళకు మేలు చేస్తున్న వాడిలా ట్రంకాల్ చేసి పిలిపించి, వాళ్ళ దగ్గర వేలకు వేలు వసూలు చేసి ఆ పిటీషన్ కాగితాన్ని చింపేస్తాడు. అదీ అసలు రహస్యం!

ఎల్లారెడ్డి అయిదు వేలు వసూలు చేసిన మూడో రోజు ఛీఫ్ మినిస్టర్ పర్సనల్ సెక్రటరీ పరంధామయ్య దగ్గరనుండి మంగపతికి పిలుపొచ్చింది.

"ఈ కాగితం చూడండి!" అంటూ పరంధామయ్య మంగపతికి ఓ కాగితం ఇచ్చాడు.

అది మంగపతి మీద చాలా ఘోరంగా రాసిన పిటీషన్.

అంతా చదివిన మంగపతి జేబులోంచి రుమాలు తీసి నుదుట పట్టిన చెమటను తుడుచుకున్నాడు.

"మీరేం భయపడకండి. మీకు ఏమీ కాకుండా చూసే బాధ్యత నాది. కానీ దానికి నేను కాస్త రిస్కు తీసుకోవాలి కదా మరి!" పరంధామయ్య భావగర్భితంగా అన్నాడు.

మంగపతి జేబులోంచి అయిదు వేలు తీసి ఇచ్చాడు.

"ఉహుం - చాలవు."

మరో అయిదు వేలు తీసి మొత్తం పది వేలు సమర్పించుకున్నాడు.

పరంధామయ్య ఆ పది వేలూ తన టేబులు సొరుగులో భద్రపరిచి మంగపతి మీద వచ్చిన పిటీషన్ని చింపిపారేశాడు. మంగపతి మొహం పాలిపోయింది.

"థాంక్స్ సార్!" అని నీళ్ళు నములుతూ శలవు తీసుకున్నాడు మంగపతి.

పరంధామయ్య మంగపతి దగ్గర తీసుకున్నది పదివేలయినా అతనికి మిగిలింది కేవలం అయిదు వేలే! ఎందుచేతనంటే ఎల్లారెడ్డికి అతను అయిదువేలు ఇచ్చేశాడు.

ఎల్లారెడ్డి పరంధామయ్యకు స్నేహితుడని పాపం మంగపతికి తెలీదు. *